క్లుప్తంగా

హనుమాన్ విగ్రహానికి పూజలు



ఖానాపురం : మండల కేంద్రంలోని హనుమాన్ విగ్రహానికి ఆంజనేయస్వాములు శనివారం ప్రత్యేక పూజలు చేశారు. చందనపు పూజ చేసి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆంజనేయస్వామి భక్తులు వెంకటేశ్, రాజు, వెంకన్న, యాకన్న, కుమారస్వామి, శ్రీను, ఈశ్వర్, కార్తీక్, అనిల్, సాయి, తదితరులు పాల్గొన్నారు.

ఆలయాలతో మానసిక ప్రశాంతత



నెక్కొండ : ఆలయాలతో మానసిక ప్రశాంతత లభిస్తుందని టీపీసీసీ సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి తెలిపారు. మండలంలోని వెంకటాపురంలోని పెద్దమ్మతల్లి, గంగమ్మ ఆలయాల్లో శనివారం ఆయన పూజలు నిర్వహించి మాట్లాడారు. యాదవ, ముదిరాజ్ కుల సంఘాలు ఆలయాలను నిర్మించడం అభినందనీయమని తెలిపారు. సమాజంలోని ప్రతీఒక్కరు భక్తి భావాన్ని పెంపొందించుకోవాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు బక్కి అశోక్, పెండ్యాల హరిప్రసాద్, నాయకులు కుసుమ చెన్నకేశవులు, రావుల మహిపాల్‌రెడ్డి, బండారు అనిల్‌కుమార్, సుంకరి సత్యనారాయణ, బండారి సంతోశ్ కుమార్, జాటోతు అఖిల్, బోయిన మధు, రమేశ్, మల్లయ్య, ఏకాంబ్రం పాల్గొన్నారు.

పరామర్శ



రాయపర్తి: మండలంలోని మైలారం గ్రామానికి చెందిన కోల సోమయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబాన్ని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు శనివారం పరామర్శించారు. సోమయ్య మృతి బాధాకరమన్నారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

చింతనెక్కొండలో..



పర్వతగిరి : మండలంలోని చింతనెక్కొండకు చెందిన మాజీ ఉపసర్పంచ్ జీడి మల్లయ్య శనివారం మృతి చెందగా బాధిత కుటుంబాన్ని వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యేలు వన్నాల శ్రీరాములు, తక్కళ్లపల్లి రాజేశ్వర్‌రావు, బీజేపీ జిల్లా నాయకుడు శ్రీధర్ ఆదివారం పరామర్శించారు. సంతాపం తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ యాలాద్రి, పిచ్చిరెడ్డి, నాయకులు పిల్లల రాములు, బత్తిని దేవేందర్, కమ్మరి సాంబయ్య, ప్రకాశ్‌రావు పాల్గొన్నారు.

ఆర్థికసాయం



గీసుకొండ : మండలంలోని మొగిలిచర్ల గ్రామంలోని శివాలయ పూజారి మార్త ఓంప్రకాశ్ ఇటీవల ఆత్మహత్య చేసుకోగా బాధిత కుటుంబానికి స్థానిక శ్రీ స్వామి వివేకానంద సేవా సంస్థ ప్రతినిధులు శనివారం రూ.33,300 నగదుతోపాటు రెండు క్వింటాళ్ల బియ్యం సాయం చేశారు. అలాగే చైతన్య యూత్ అసోసియేషన్ ప్రతినిధులు రూ.5 వేలు సాయం అందించారు. ఈ సందర్భంగా స్వామి వివేకానంద సేవా సంస్థ ప్రతినిధులు మాట్లాడారు. దాతల నుంచి విరాళాలు సేకరించి బాధిత కుటుంబానికి అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వివేకానంద సేవా సంస్థ అధ్యక్షుడు ఆడెపు రమేశ్, ఉపాధ్యక్షుడు కామగోని రఘుపతి, ప్రధాన కార్యదర్శి బిల్లా రమేశ్, కోశాధికారి రాధారపు శివకుమార్, సహాయ కోశాధికారి లెంకలపెల్లి స్వామి, రాధారపు మల్లికార్జున్ పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత

ఐనవోలు : మండలంలోని ఉడుతగూడెంకు చెందిన దాట్ల ప్రవీణ్ ఐనవోలు పరిసరాల్లో సెల్‌ఫోన్‌ను పోగొట్టుకుని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేశాడు. సీఈఐఆర్ సాంకేతిక పరిజ్ఞానం ద్వారా పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను వెతికి బాధితుడికి అప్పగించినట్లు ఎస్సై అనిల్‌కుమార్ తెలిపారు.

జేసీబీ, టిప్పర్ల పట్టివేత

దామెర : మండలంలోని కోగిల్వాయి శివారులోని చంద్రగిరి గుట్టల వద్ద అనుమతులు లేకుండా శనివారం రాత్రి మొరం తరలిస్తున్న జేసీబీ, రెండు టిప్పర్లను పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై అశోక్ తెలిపారు. దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

‘ఉపాధి’ మట్టి అక్రమ రవాణా

● రైతన్నలకు మొండిచేయి

నల్లబెల్లి : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనుల్లో తీసిన నల్లమట్టిని అక్రమ రవాణా చేస్తున్న పరిస్థితి మండలంలో నెలకొంది. వ్యవసాయ భూములను సారవంతం చేసే దిశగా రైతులకు ఇవ్వాల్సిన నల్లమట్టిని ఈజీఎస్ అధికారులు, సిబ్బంది ఇటుక బట్టీలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని, నల్లమట్టిని ఇవ్వకుండా రైతులకు మొండిచేయి చూపిస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

మండలంలోని అర్వయ్యపల్లి, రాంతీర్థం, రుద్రగూడెం గ్రామాల్లోని చెరువుల్లో చేపడుతున్న పూడికతీత పనుల్లో కూలీలు తీస్తున్న నల్లమట్టిని ఈజీఎస్ అధికారులు, సిబ్బంది శనిగరం శివారులోని ఇటుక బట్టీలకు తరలిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం నల్లమట్టిని రైతులు వ్యవసాయ భూముల్లో వినియోగించుకోవాల్సిన ఉంది. కానీ ఈజీఎస్ అధికారులు. సిబ్బంది రైతులకు మొండిచేయి చూపుతున్నట్టు పలువురు వాపోతున్నారు. కొందరు వ్యాపారులు సారమంతమైన చెరువు నల్లమట్టిని గుట్టలుగా నిల్వ చేస్తున్న పరిస్థితి కనపడుతోంది. ఈజీఎస్ అధికారులు, సిబ్బంది తోపాటు అక్రమాలకు పాల్పడుతున్న ఇటుక బట్టీల నిర్వాహకులపై ప్రభుత్వం, జిల్లా ఉన్నతాధికారులు చట్టరీత్యా చర్యలు తీసుకుని నల్లమట్టిని రైతులు వ్యవసాయ భూములకు తరలించుకునేలా చూడాలని మండల ప్రజలు, రైతులు ప్రభుత్వాన్ని, జిల్లా ఉన్నతాధికారులను కోరుతున్నారు.



శనిగరం శివారులో నిల్వ చేసిన నల్లమట్టి



ఇటుక బట్టీకి తరలుతున్న నల్లమట్టి

వేలాది ట్రిప్పులు.. చర్యలు శూన్యం..

మండలంలోని చెరువుల నుంచి తీసిన నల్లమట్టిని వేలాది ట్రిప్పుల్లో ఇటుక బట్టీలకు అక్రమంగా తరలిస్తున్నా అధికారులు చర్యలు తీసుకోవడం లేదని రైతులు, ప్రజలు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. కొందరు ఇటుక బట్టీల యజమానులు ఇరిగేషన్ శాఖకు డబ్బులు చెల్లిస్తున్నట్లు చెబుతుండగా మరికొందరు గుట్టుగా సారవంతమైన నల్లమట్టిని తరలిస్తూ గుట్టలుగా నిల్వ చేస్తున్నారు.

అక్రమాలకు పాల్పడితే చర్యలు



జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనుల్లో భాగంగా మండలంలోని పలు చెరువులు, కుంటల్లో పూడికతీత జరుగుతోంది. కూలీలు పూడిక తీసిన నల్లమట్టిని రైతులు చెలకల్లోకి తరలించుకునే అవకాశం కల్పిస్తాం. ఉపాధి పనులు జరుగుతున్న చెరువులను, ఇటుక బట్టీల్లో తనిఖీ చేసి అక్రమాలు జరిగితే చర్యలు తీసుకుంటాం.

-నర్సింహమూర్తి, ఎంపీడీఓ, నల్లబెల్లి

కార్మికుల సమస్యల పరిష్కారమే ధ్యేయం

● సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటయ్య

నర్సంపేట : కార్మికుల సమస్యల పరిష్కారమే సీఐటీయూ ధ్యేయమని తెలంగాణ పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చాగంటి వెంకటయ్య తెలిపారు. పట్టణంలో యూనియన్ మండల ఉపాధ్యక్షుడు కుమ్మరికుంట్ల సదానందం అధ్యక్షతన శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామ పంచాయతీ ఉద్యోగులు, కార్మికులు దశాబ్దాలుగా పని చేస్తున్న ఉద్యోగ భద్రత లేదని చెప్పారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన మల్టీపర్పస్ విధానంతో పంచాయతీ కార్మికులు నిర్విరామంగా సేవలు అందిస్తున్నా కనీస వేతనాలు అమలు కావడం లేదన్నారు. హక్కుల సాధన, సమస్యల పరిష్కారం కోసం మేడేను విజయవంతం చేయాలని కోరారు. అనంతరం సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ముక్కెర రామస్వామి మాట్లాడారు. ఐక్యపోరాటాల ద్వారానే కార్మికుల సమస్యలు పరిష్కారమవుతాయని, హక్కులు సాధించుకోగలమని చెప్పారు. సుమారు 40 మంది యూనియన్‌లో చేరారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్బదాశి అశోక్, జిల్లా ఉపాధ్యక్షుడు పుట్టపాక రాజేందర్, మండల ఉపాధ్యక్షుడు ఆరెపల్లి శంకర్, కార్యదర్శి వేల్పుల రవి, కోశాధికారి కుమ్మరికుంట్ల రాజు, నాయకులు దవడ పద్మ, చిలువేరు రాధమ్మ తదితరులు పాల్గొన్నారు.



యూనియన్‌లో చేరిన వారితో నాయకులు

జేఈఈ మెయిన్స్‌లో ప్రతిభ



రాయపర్తి : మండలంలోని కొత్తూరు గ్రామానికి చెందిన కొండా భాస్కర్–కోమల దంపతుల కుమారుడు పృథ్వీరాజ్ జేఈఈ మెయిన్స్‌లో ప్రతిభ చాటి 316వ ర్యాంక్ సాధించాడు. ఈ సందర్భంగా ఆయన్ను గ్రామస్తులు శనివారం అభినందించారు. పృథ్వీరాజ్ హనుమకొండలోని శివానీ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ పూర్తి చేశాడు. ఎంపీసీ విభాగంలో 980 మార్కులు సాధించి ప్రతిభావంతుడిగా నిలిచాడు. అలాగే జేఈఈ మెయిన్స్‌లోనూ మెరుగైన ర్యాంక్ సాధించడంతో ఆయన్ను పలువురు అభినందించారు. తండ్రి భాస్కర్ ప్రైవేట్ స్కూల్‌లో బస్సు డ్రైవర్‌గా పని చేస్తూ చదివిస్తుండగా పృథ్వీరాజ్ కష్టపడి మెరుగైన ఫలితాలు సాధించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

ఒకరిపై దాడి



చెన్నారావుపేట : మండలంలోని ఉప్పరపల్లికి చెందిన దళితుడిడైన మంద మధూకర్‌పై గ్రామానికి చెందిన వట్టె శ్రీను, రవికిరణ్, దొనకొండ కరుణాకర్, కట్కూరి రాజు ఇనుప రాడ్లతో శనివారం దాడి చేశారు. గాయాల పాలైన మధూకర్‌ను స్థానికులు చికిత్స నిమిత్తం వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. మధూకర్ కుటుంబీకులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

కేసీఆర్ రోడ్ షోను జయప్రదం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న జితేందర్‌రెడ్డి

పర్వతగిరి : హనుమకొండ, వరంగల్‌లో మాజీ సీఎం కేసీఆర్ తలపెట్టిన బస్సు యాత్రను, రోడ్ షోను విజయవంతం చేయాలని బీఆర్‌ఎస్ పార్టీ మండల కన్వీనర్ ఏడుదొడ్ల జితేందర్‌రెడ్డి కోరారు. మండల కేంద్రంలోని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు నివాసంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వరంగల్ పార్లమెంటు అభ్యర్థి డాక్టర్ సుధీర్‌కుమార్ ఎన్నికల ప్రచారంలో భాగంగా కేసీఆర్ నేడు (ఆదివారం) బస్సు యాత్ర, రోడ్ షోకు రానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మార్గం భిక్షపతి, నాయకులు చింతపట్ల మాలతి సోమేశ్వర్‌రావు, మేడిశెట్టి రాములు, ఎర్రబెల్లి రాజేశ్వర్‌రావు, మాడుగుల రాజు, బోయినపల్లి యుగంధర్‌రావు, చిన్నపాక శ్రీనివాస్, ఏర్పుల శ్రీనివాస్, కరిమిల్లా దుర్గారావు, మాదాసి సుధాకర్, చింతల శ్రీనివాస్ పాల్గొన్నారు.

కారు బోల్తా



చెన్నారావుపేట : కారు అదుపుతప్పి బోల్తా పడిన ఘటన మండలంలోని పాపయ్యపేట శివారులో శనివారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. చెన్నారావుపేట నుంచి మహబూబాబాద్ జిల్లాలోని గూడూరుకు వెళ్తున్న కారు ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి ప్రమాదశాత్తు రోడ్డు పక్కన బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో కారు నడుపుతున్న వ్యక్తికి తీవ్ర గాయాలు కాగా స్థానికులు చికిత్స నిమిత్తం నర్సంపేటకు తరలించారు.

మేడేను విజయవంతం చేయాలి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నర్సింగం, నాయకులు

నర్సంపేట : మేడేను విజయవంతం చేయాలని సివిల్ సప్లై కార్మికుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు గుంపెల్లి మునీశ్వర్ కార్మికులను కోరారు. పట్టణంలో యూనియన్ గోదాం కమిటీ అధ్యక్షుడు కొత్తగట్టు నర్సింగం అధ్యక్షతన మేడే పోస్టర్లను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మునీశ్వర్ మాట్లాడారు. సుదీర్ఘ పోరాటాల ఫలితంగా సాధించుకున్న కార్మిక చట్టాలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నాలుగు కోడ్‌లుగా సవరించి మోసపూరితంగా వ్యవహరించిందని విమర్శించారు. నాలుగు కోడ్‌లను రద్దు చేసి 44 కార్మిక చట్టాలను అమలు చేయడంతోపాటు కార్మికుల అన్ని సమస్యలనూ పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు అక్కనపల్లి రమేశ్, ఆర్.సతీశ్, కె.మల్లయ్య, బి.కిశోర్, ఎం.రవి, ఎం.మహేందర్, సాంబయ్య, టి.కుమార్, టి.వీరస్వామి, ఎల్లబోయిన రవి, నాసం శ్రీను, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

లక్కీడ్రాతో విద్యార్థుల ఎంపిక



దామెర : మండలంలోని ఓగ్లాపూర్ సమీపంలోని మైనారిటీ గురుకుల పాఠశాలలో 5వ తరగతి ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు శనివారం లక్కీడ్రా ద్వారా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీలత వివరాలు వెల్లడించారు. నాన్ మైనారిటీ విభాగంలో 45 మంది దరఖాస్తులు చేసుకోగా 10 మందిని, ఎస్సీ క్యాటగిరీలో 25 మందిని ఎంపిక చేసినట్లు తెలిపారు. విద్యార్థులు దరఖాస్తులు చేసుకోగా ఐదు గురిని ఎంపిక చేశామన్నారు. ఎస్టీ క్యాటగిరీలో ఆరుగురికి గాను ముగ్గురిని, ఓసీ క్యాటగిరీలో ఒకరిని ఎంపిక చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో మైనారిటీ గురుకులాల విజిలెన్స్ అధికారి అమ్జద్, ఉపాధ్యాయులు రహీం, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

బీజేపీ, బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిక



కాంగ్రెస్‌లో చేరిన వారితో ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి, నాయకులు

సంగెం : మండలంలోని ఎల్గూర్ రంగంపేటకు చెందిన పలువురు బీజేపీ, బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో అధికార ప్రతినిధి జనగాం రమేశ్ గౌడ్ ఆధ్వర్యంలో పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి సమక్షంలో శనివారం చేరారు. కాంగ్రెస్‌లో బోనాల అనిల్, బెజ్జెంకి సదానందం, బోనాల సదానందం, రమేశ్, రవి, సతీశ్, ఉప్పలయ్య, ప్రశాంత్, సమ్మయ్య, నర్సయ్య, పవన్, రాజబోయిన సాంబయ్య, కడమంచి చంద్రమౌళి, సారంగం, ఇమ్మడి సంపత్, బరిగెల యాకూబ్, బుజ్జక్క తదితరులు చేరగా వారికి ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చొల్లేటి మాధవరెడ్డి, మాజీ సర్పంచ్‌లు పోతుల ప్రభాకర్, పెద్దగోని లక్ష్మీనారాయణ, ఇమ్మడి ఏసోబు, బోనాల శ్రీనివాస్, బోగి రవి తదితరులు పాల్గొన్నారు.

‘కాంగ్రెస్ నాయకులను ప్రశ్నించండి’

ఆత్మకూరు : ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజలను మోసం చేసి మరోసారి ప్రజల్లోకి వస్తున్న కాంగ్రెస్ నాయకులను ప్రశ్నించాలని మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి కోరారు. మండల కేంద్రంతోపాటు కటాక్షపూర్, హౌజుబుజుర్గు, నీరుకుళ్ల, పెంచికలపేట, చౌళ్లపల్లి, కొత్తగట్టు, మల్కపేట, గూడెప్పాడ్, తిరుమలగిరి గ్రామాల్లో శనివారం స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలతో మాట్లాడారు. రైతుబంధు, రూ.4వేల పింఛన్, రుణమాఫీ, మహిళలకు రూ.2500 సాయం, నిరుద్యోగ భృతి వంటి హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అటకెక్కించిందన్నారు. వరంగల్ పార్లమెంట్ బీఆర్‌ఎస్ పార్లమెంటు అభ్యర్థి సుధీర్‌కుమార్‌ను గెలిపించే దిశగా పని చేయాలని కోరారు. సమావేశంలో మండల అధ్యక్షుడు సంజీవరెడ్డి, నాయకులు కేశవరెడ్డి, కుమారస్వామి, రవియాదవ్, రాజేశ్వర్‌రావు, మాజీ సర్పంచ్‌లు యాదగిరి, రబియాబీహుస్సేన్, బలరాం, లలిత, మనోహర్, నరేష్ పాల్గొన్నారు.

జీపీలో ఎంబీ రికార్డు మాయం

దామెర : గ్రామపంచాయతీ ఎంబీ రికార్డు మాయమైన ఘటన మండలంలోని ల్యాదెళ్లలో వెలుగులోకి వచ్చింది. 804 నంబర్ ఎంబీ రికార్డు కార్యాలయంలో లేకపోవడం పలు అనుమానాలకు తావిస్తుంది. ఎంబీ రికార్డు రెండు సంవత్సరాల క్రితం అప్పటి వార్డు సభ్యుడు గ్రామంలో చేపట్టిన పనులకు సంబంధించి రికార్డులో నమోదు చేసేందుకు తీసుకెళ్లినట్లు తెలిసింది. అనంతరం తిరిగి ఇవ్వలేదని తెలిసింది. గ్రామపంచాయతీ పాలకవర్గం కాలపరిమితి ముగిసి నెలలు గడుస్తున్నా ఎంబీ రికార్డు మాత్రం పంచాయతీ కార్యదర్శికి అందించకపోవడంపై గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కాగా ఉన్నతాధికారులు దృష్టిసారించి ఎంబీ రికార్డు జీపీకి అప్పగించి విచారణ చేపట్టాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి అన్నపూర్ణని వివరణ కోరగా.. ఎంబీ రికార్డు మాజీ వార్డు సభ్యుడు భరత్ తీసుకెళ్లినట్లు తెలిసిందన్నారు. ఇప్పటికే పలుమార్లు జీపీకి అప్పగించాలని కోరామని తెలిపారు. ఇవ్వని పక్షంలో పోలీసులకు ఫిర్యాదు చేస్తామని చెప్పారు.

శాంతికృష్ణ ఆచార్యకు అభినందన

పర్వతగిరి : గిన్నీస్ వరల్డ్ రికార్డ్స్ అవార్డు గ్రహీత, సహస్ర మహోత్సవ సమ్రాట్, బతుకమ్మ తల్లి గ్రంథకర్త, విశ్వకళా విరాట్ డాక్టర్ శాంతికృష్ణ ఆచార్యను వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు అభినందించారు. తొలుత హనుమకొండలోని తన నివాసంలో ఎమ్మెల్యేను శాంతికృష్ణ శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా శాంతికృష్ణ మాట్లాడారు. బతుకమ్మ తల్లి జన్మ స్థలమైన చౌటపల్లిలో సుమారు రూ.100 కోట్ల వ్యయంతో నిర్మించతలపెట్టిన బతుకమ్మ తల్లి తొలి ఆలయ నిర్మాణం నేపథ్యంలో మే నెలలో అమెరికాలో తాను పర్యటించనున్నట్లు తెలిపారు. తద్వారా బతుకమ్మ తల్లి విశిష్టతను విశ్వవ్యాప్తం కావించనున్నట్లు చెప్పారు. అనంతరం ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడారు. శాంతికృష్ణ అమెరికా పర్యటన విజయవంతం కావాలని ఆకాంక్షించారు. బతుకమ్మ తల్లి తొలి ఆలయ నిర్మాణం త్వరలోనే సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించడానికి ప్రభుత్వం సహకరిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో చౌటపల్లి గ్రామ మాజీ సర్పంచ్ వంగాల వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు జ్ఞాపిక అందజేస్తున్న శాంతికృష్ణ

సమన్వయంతోనే సమగ్రాభివృద్ధి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ అనిమిరెడ్డి

రాయపర్తి : అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేస్తేనే మండల సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని ఎంపీపీ జీనుగు అనిమిరెడ్డి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజాసమస్యల పరిష్కారం కోసం ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలు తెలుసుకుని పరిష్కార దిశగా చరవ చూపాలని కోరారు. తొలుత ప్రజాప్రతినిధులు పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అధికారులు సానుకూలంగా సమాధానమిచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గుగులోతు కిషన్‌నాయక్, తహసీల్దార్ శ్రీనివాస్, సీడీపీఓ డెబోరా, పశు వైద్యాధికారి శృతి, ఎంఈఓ నోముల రంగయ్య, ఏపీఎం కిరణ్‌కుమార్, ఎంపీటీసీలు బిల్లా రాధిక, కందికట్ల రాధమ్మ, బండి అనూష, వెంకన్న, చిక్కొండ రజిత తదితరులు పాల్గొన్నారు.

ప్రీస్కూల్‌తో చిన్నారుల్లో వికాసం



చిన్నారులు, తల్లులతో అంగన్‌వాడీ టీచర్లు

చెన్నారావుపేట : ప్రీస్కూల్‌తో చిన్నారుల్లో శారీరక, మానసిక వికాసం కలుగుతుందని అంగన్‌వాడీ టీచర్ కవిత తెలిపారు. మండలంలోని అక్కల్‌చెడ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఎర్లీ చైల్డ్ కేర్ ఎడ్యుకేషన్ (ఈసీసీఈ) కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్ కవిత మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చే చిన్నారులకు ఆటపాటలతో నాణ్యమైన విద్య, పౌష్టికాహారం అందిస్తున్నట్లు తెలిపారు. ప్రైవేటు స్కూళ్లకు దీటుగా ఇంగ్లిష్, తెలుగు మాధ్యమాల్లో విద్యాబోధన లభిస్తుందని చెప్పారు. చిన్నారుల తల్లిదండ్రులు వినియోగించుకోవాలని కోరారు. వేసవి నేపథ్యంలో చిన్నారుల పట్ల తల్లిదండ్రులు మరింత అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు స్వరూప, సరిత, ఆయాలు జ్యోతి, ఆగమ్మ, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపకురాలికి డాక్టరేట్ ప్రదానం

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలం లక్నెపల్లి శివారులోని బాలాజీ ఇంజనీరింగ్ కళాశాలలో హ్యూమానిటీస్ అండ్ సైన్స్ విభాగ అధ్యాపకురాలు కరుణశ్రీ ఇంగ్లిష్‌లో డాక్టరేట్ అందుకున్నారు. ఈ సందర్భంగా కరుణశ్రీని కళాశాల చైర్మన్ డాక్టర్ రాజేంద్రప్రసాద్‌రెడ్డి, సెక్రెటరీ డాక్టర్ జి.రాజేశ్వర్ రెడ్డి శనివారం సన్మానించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వీఎస్.హరిహరణ్ మాట్లాడారు. కరుణశ్రీ ప్రొఫెసర్ జి.దామోదర్ పర్యవేక్షణలో వరంగల్‌లోని చైతన్య డీమ్డ్ యూనివర్సిటీలో చేసిన పరిశోధనకు గాను డాక్టరేట్ ప్రదానం చేశారని తెలిపారు. కార్యక్రమంలో బాలాజీ విద్యాసంస్థల ట్రెజరర్ డాక్టర్ ఎ.వనజారెడ్డి, ఏఓ ఎస్.సురేశ్, అకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ వి.నారాయణ, హ్యూమానిటీస్ అండ్ సైన్స్ విభాగాధిపతి జి.శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



కరుణశ్రీని అభినందిస్తున్న చైర్మన్, తదితరులు

పల్లెల్లో ‘ఉపాధి’ పనుల జోరు



పని చేస్తున్న కూలీలు

చెన్నారావుపేట : మండలంలోని పల్లెల్లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులు జోరుగా సాగుతున్నాయి. మండల కేంద్ర శివారులోని కోపాకుల ఊర చెరువు వద్ద చెన్నారావుపేట, అక్కల్‌చెడ, ఖాదర్‌పేట గ్రామాలకు చెందిన కూలీలు శనివారం పనులు చేశారు. కొద్ది రోజులుగా గ్రామాల్లోని చెరువుల వద్ద కూలీలు పూడికతీత పనులు చేపడుతున్నారు. నీటి నిల్వ సామర్థ్యం పెంచడం కోసం కూలీలు బంటాలు తీస్తున్నారు. బంటాల్లో తీసిన చెరువు మట్టిని కూలీలే ట్రాక్టర్లలో నింపుతున్నారు. నింపిన మట్టిని వ్యవసాయ భూముల్లో పోసేందుకు రైతులు ట్రాక్టర్లలో తీసుకెళ్తున్నారు.

ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీ

వర్ధన్నపేట : లోకసభ ఎన్నికల నేపథ్యంలో ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం ఏడీఏ సురేశ్‌కుమార్ ఆధ్వర్యంలో దమ్మన్నపేట శివారులోని వర్ధన్నపేట–జఫర్‌గడ్ ప్రధాన రహదారిపై శనివారం సాయంత్రం వాహనాలను తనిఖీ చేసింది. ద్విచక్ర వాహనాలను, ఆటోలను, కార్లను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా సురేశ్‌కుమార్ మాట్లాడారు. వాహనాల్లో రూ.50 వేలకు మించి డబ్బులు తీసుకెళితే సంబంధిత ఆధారాలు, అనుమతి పత్రాలు లేదా వెంట ఉంచుకోవాలని సూచించారు. అభ్యర్థులు ఓటర్లను ప్రలోభాలకు గురి చేస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ప్రజాప్రతినిధులు, ప్రజలు ఎన్నికల నియమాలను పాటించి సహకరించాలని కోరారు.



తనిఖీ చేస్తున్న ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం